సాక్షి ఖమ్మం

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



త్రివేణి సంగమం

త్రివేణి సంగమంగా పేరున్న తీర్థాలలోని సంగమేశ్వర ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది.

8లో



గోళ్లపాడు అదరహో!

జిల్లా కేంద్రంలోని గోళ్లపాడు చానల్‌పై నిర్మించిన పార్కులు, ఓపెన్ జిమ్, ఆట వస్తువులతో కొత్తకళ సంతరించుకుంది.

10లో

గరిష్టం / కనిష్టం

35° / 20°

వాతావరణం

శుక్రవారం ఉదయం, సాయంత్రం చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

20 నుంచి షర్మిల పాదయాత్ర

- నాలుగు మండలాల్లో 14 రోజులు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల పాలేరు నియోజకవర్గంలో ఈనెల 20 నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. ఈనెల 20న వరంగల్ – ఖమ్మం సరిహద్దు మీదుగా ఇస్లావత్ తండాలోకి యాత్ర ప్రవేశిస్తుంది. నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో 14 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఈమేరకు షర్మిల పాదయాత్రలో పార్టీ శ్రేణులు, వైఎస్ అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

19న అండర్–18 అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 19న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్–18 యూత్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఇక్కడ ప్రతిభ చాటే అథ్లెట్లను వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్–18 యూత్ అథ్లెటిక్స్ పోటీలు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అలాగే, అండర్–14, 18, 20 విభాగాల్లో మహిళలు, పురుషుల ఎంపిక పోటీలు ఉంటాయని, అథ్లెట్లు వయసు ధృవీకరణపత్రాలతో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని వారు ఓ ప్రకటనలో సూచించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కంటి అద్దాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

మధిర: ప్రజలెవరూ దృష్టిలోపం సమస్యలతో ఇబ్బంది పడకుండా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాలతి సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణతో పాటు అద్దాల పంపిణీని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, పలువురికి కంటి అద్దాలు అందజేశారు. ఆతర్వాత ఒక ప్రైవేట్ ఆస్పత్రి, క్లినిక్‌ల్లో కూడా డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. వైద్యులు అనిల్‌కుమార్, వెంకటేష్, ప్రశాంత్, పృథ్వి, ఉద్యోగులు మోక్షరాణి, వి.కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

ఖమ్మంమామిళ్లగూడెం: బీసీ స్టడీ సర్కిల్ రాష్ట్ర డైరెక్టర్ అశోక్‌కుమార్ గురువారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత స్వాగతం పలికారు. అనంతరం పలు హాస్టళ్లలో తనిఖీ చేసిన ఆయన స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న గ్రూపు–1, 2 అభ్యర్థులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. కాగా, బీఆర్‌ఎస్ నగర ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, ఎంబీసీ ప్రధాన కార్యదర్శి దరిపల్లి శ్రీనివాస్, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దాసాహెబ్ తదితరులు కూడా అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యాయాధికారుల భవనాలకు స్థల పరిశీలన



స్థలపత్రాలు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్: న్యాయశాఖ అధికారుల నివాస భవనాల కోసం నగరంలోని బుర్హాన్‌పురంలోని 98 సర్వే నంబర్‌లో స్థలం కేటాయించారు. ఈ మేరకు స్థలాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల క్వార్టర్స్ కోసం ప్రభుత్వం 3.08ఎకరాల స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. జిల్లా కోర్టు ఉద్యోగులు సూర్యనారాయణమూర్తి, రాధేశ్యాంతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం!

- స్థలాల క్రమబద్ధీకరణకు కసరత్తు
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశంతో జిల్లాలో వేగంగా ప్రక్రియ
- 58, 59 జీఓల కింద జిల్లాలో 11,152 దరఖాస్తులు
- యాజమాన్య హక్కు కల్పించడంపై క్షేత్రస్థాయిలో పరిశీలన



దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారిస్తున్న ఖమ్మం అర్బన్ తహసీల్దార్ బృందం (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం 58, 59 జీఓల ద్వారా అవకాశం కల్పించింది. ఈక్రమంలో జిల్లా వ్యాప్తంగా తమ స్థలాలు క్రమబద్ధీకరించాలంటూ 11,152 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యాన 13వ తేదీన సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అంశంపై జిల్లా అధికారులతో సమీక్షించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. గతంలోనూ దరఖాస్తుల పరిశీలనకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మరోపక్క స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో తనిఖీ బృందాలు వివరాలను నమోదు చేశాయి.

స్థలంపై హక్కు కోసం..

సుదీర్ఘ కాలంగా ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి వాటిపై ఎలాంటి హక్కు ఉండదు. తాతముత్తాతల కాలం నుంచి ఆ స్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నా.. ఆ స్థలంపై ఎలాంటి హక్కు లేకపోగా బ్యాంకు రుణాలు, ఇతర సమయాల్లో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే 58, 59 జీఓలను విడుదల చేసింది. ఇందులో 58 జీఓ ద్వారా 125 చదరపు గజాల లోపు స్థలం ఉంటే ఉచితంగా, జీఓ 59 ద్వారా 125 చదరపు గజాల విస్తీర్ణం దాటిన స్థలమైతే మార్కెట్ ధర చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారు. అయితే స్థలం తమదిగా చెప్పుకునేందుకు ఏదో ఒక ఆధారం చూపించాల్సి ఉంటుంది.

చాలా కాలంగా..

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అంశంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించడంతో ఇంటి యజమానికి హక్కు కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. క్రమబద్ధీకరణ దరఖాస్తులు స్వీకరించాక కొంత కాలం స్తబ్దత నెలకొంది. దీంతో లబ్ధిదారులు ఎదురుచూస్తుండగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 2016 ఏడాది కన్నా ముందు నిబంధనల మేరకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి దరఖాస్తులు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తనిఖీ చేశాక మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ఆతర్వాత మళ్లీ కదలిక లేకపోగా ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగగా దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

జీఓ నంబర్ 58 కింద వచ్చిన దరఖాస్తులు	9,398
అనుమతి పొందిన దరఖాస్తులు	3,253
తిరస్కరించిన దరఖాస్తులు	5,346
జీఓ నంబర్ 59కి బదలాయించినవి	799
జీఓ నంబర్ 59 కింద వచ్చిన దరఖాస్తులు	1,754
అనుమతి పొందిన దరఖాస్తులు	1,682
తిరస్కరించినవి	72

క్షేత్రస్థాయిలో అధికారులు

ప్రస్తుతం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఖమ్మం నగర పరిధిలోనే 6,217 దరఖాస్తులు రావడంతో 22 బృందాలను పరిశీలనకు నియమించారు. పరిశీలనకు వెళ్లిన సమయంలో అక్కడి వాస్తవ పరిస్థితులు, దరఖాస్తుల్లో పేర్కొన్న అంశాలన్నీ సరిపోలితే క్రమబద్ధీకరణకు ఓకే చెప్పనున్నారు. గతంలో చేసిన తనిఖీలకు తోడు మళ్లీ తనిఖీ చేస్తుండడంతో ఎక్కడా అవకతవకలకు తావు ఉండదని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ రెండు జీఓల కింద సత్తుపల్లి మండలంలో 1,988, ఖమ్మం రూరల్ మండలంలో 848, కూసుమంచి మండలంలో 824, వేంసూరు మండలంలో 588 దరఖాస్తులు వచ్చాయి.

ఏడేళ్లు ఉండి పార్టీకి ద్రోహం చేస్తావా?



మాట్లాడుతున్న తాతా మధు, పక్కన మేయర్ నీరజ, ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

- మీవి పొగడ్తలు.. మావి నామస్మరణలా
- పొంగులేటిపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు ఆగ్రహం

ఖమ్మం వైరారోడ్: బీఆర్‌ఎస్‌లో ఏడేళ్లు కొనసాగి కలలన్నీ నెరవేర్చుకున్నాక ఇప్పుడు పార్టీకి ద్రోహం చేస్తావా అంటూ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుండడంతోనే శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరారని చెప్పారు. గత ఏడేళ్లు పార్టీలో కొనసాగిన ఆయన తన ఆస్తులను రూ.300 కోట్ల నుంచి రూ.3వేల కోట్లకు పెంచుకున్నారని ఆరోపించారు. వైరాలో జరిగిన సమ్మేళనంలో ఆయన మాట్లాడినవన్నీ అబద్ధాలేనని విమర్శించారు. పార్టీ నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నామజపమే చేస్తున్నారని చెప్పిన శ్రీనివాసరెడ్డి.. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఎవరి జపం చేశారో చెప్పాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ గురించి గొప్పగా చెప్పకుండా మోదీ, రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతారా అని ప్రశ్నించారు. ధరణి వెబ్‌సైట్ తప్పుల కుప్పగా మారిందని పేర్కొన్న పొంగులేటి, ఆయన 108 ఎకరాల భూమి ధరణిలో నమోదైందో, కాలేదో చెప్పాలని సూచించారు. ఇక సీతారామ ప్రాజెక్టు పదిహేనేళ్లయినా పూర్తి కాదన్న మాజీ ఎంపీ టెండర్ వేసినట్లు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మధు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ నీరజ, జిల్లా రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కమర్తపు మురళి, బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు ఖమర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



లబ్ధిదారుల ఇంటి వద్ద కంటిఅద్దాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుండి గురువారం ఆమె కంటి వెలుగు, రెండు పడక గదుల ఇళ్లు, పోడు భూములు, 58, 59, 76, 118 జీఓల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎండలు పెరుగుతున్నందున తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే, ప్రిస్క్రిప్షన్ అద్దాలు చేరగానే లబ్ధిదారులకు అందజేయాలని చెప్పారు. ఇంకా డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఈనెల 26లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. పోడు భూముల పట్టాలను ఈనెలాఖరు నుంచి పంపిణీ చేసే అవకాశమున్నందున పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని సీఎస్ తెలిపారు. ఈసందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ అద్దాల పంపిణీ చేపట్టగా, జీఓలు 58, 59 దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీసీలో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్వో శిరీష, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, డీఆర్డీఓ విద్యాచందన, డీటీడబ్ల్యూఓ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు మంచి స్పందన

రఘునాథపాలెం: కంటి వెలుగు శిబిరాలకు జిల్లాలో మంచి స్పందన వస్తోందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మండలంలోని వీ.వీ.పాలెంలో కంటివెలుగు శిబిరాన్ని గురువారం తనిఖీ చేసిన ఆయన పలువురి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కంటి అద్దాల పనితీరుపై ఆరా తీశారు. దీంతో గుగులోతు కృష్ణ, గుగులోతు కావేరి తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం కంటిచూపు మెరుగైందని కలెక్టర్‌కు తెలిపారు. కాగా, తొలుత శిబిరంలో కలెక్టర్ పరీక్షల నిర్వహణను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. జిల్లాకు 1,888 ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు చేరగా లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. తనిఖీలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, స్థానిక డాక్టర్ సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రాక్టికల్ పరీక్షలు

పలు కేంద్రాల్లో తనిఖీ చేసిన డీఐఈఓ



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. జిల్లాలోని పలు కేంద్రాలను గురువారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. జిల్లాలోని 39 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతుండగా, 19,198 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి 4 నుంచి జరగనుండగా, 35,857 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. కాగా, ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం ఉదయం 3,324మందిలో 3,057మంది, మధ్యాహ్నం పరీక్షకు 2,332మందిలో 2,222మంది హాజరు కాగా, పలు కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని డీఐఈఓ రవిబాబు వివరించారు. ఈ తనిఖీల్లో డీఈసీ సభ్యులు, కల్లూరు, నేలకొండపల్లి ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాళ్లు కె.శ్రీనివాసరావు, ఎస్.ఎన్.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

కొణిజర్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ సోమశేఖర శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో సమావేశమై వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరుపై ఆరా తీయడమే కాక పలు సబ్జెక్టుల్లో సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే, విద్యార్థులను సిద్ధం చేయాల్సిన తీరుపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెచ్‌ఎం దామాల పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్.విజయమ్మకు ఘనస్వాగతం

- పాలేరు నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవం
- షర్మిలమ్మను ఆదరించాలని పిలుపు



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న విజయమ్మ



వైఎస్సార్ టీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయమ్మ

ఖమ్మంరూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్.విజయమ్మకు వైఎస్సార్ టీపీ పాలేరు నియోజకవర్గ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్ నగర్‌లో ఏర్పాటుచేసిన వైఎస్సార్‌టీపీ పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. తొలుత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించాక పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నేతలు భారీ ఎత్తున తరలివచ్చి షర్మిలమ్మ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి విజయమ్మ మాట్లాడుతూ వైఎస్ కుటుంబాన్ని మొదటి నుంచి ఖమ్మం జిల్లా ఆదరిస్తోందన్నారు. ఈ జిల్లాతో తమకు అవినాభావ సంబంధం ఉందని.. షర్మిలమ్మ ఓదార్పుయాత్ర, రెండుసార్లు పాదయాత్ర ఇక్కడి నుంచే జరిగాయని గుర్తు చేశారు. పార్టీ ప్రకటన, పాలేరు నుంచి పోటీ చేయాలనే నిర్ణయం వెనుక దేవుడి ప్రణాళిక, దైవేచ్ఛ ఉందని నమ్ముతున్నట్లు ఆమె చెప్పారు. పాలేరు నియోజకవర్గ ప్రజలు షర్మిలమ్మకు గట్టి పునాదిని ఇచ్చి ఆదరించాలని కోరారు. అలాగే ఎప్పుడూ, ఎవరూ చూడని మెజార్టీ ఇచ్చి ఆమెను గెలిపించాలని విజయమ్మ పిలుపునిచ్చారు. అనంతరం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో ఆమె కొద్దిసేపు సమావేశమై పాలేరులో షర్మిలమ్మ పోటీ చేయనున్నందున నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు, రాష్ట్ర కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత, జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబుతో పాటు పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, నంద్యాల రవీందర్‌రెడ్డి, తుంపాల కృష్ణమోహన్, జల్లేపల్లి సైదులు, ఆలస్యం రవి, రాంబాబు, యండపల్లి వెంకయ్య, వాలూరి సత్యనారాయణ, వై.వీ.డీ.రెడ్డి, రూప్లానాయక్, బత్తిని యాలాద్రి, లింగనబోయిన ఉమ, మస్తాన్ సాహెబ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన తుమ్మల

'బుగ్గపాడు' పూర్తికి హామీ ఇచ్చారని ప్రకటన



మంత్రి కేటీఆర్‌ను సత్కరించిన తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సత్తుపల్లి మండలం బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరినట్లు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం మంత్రి కేటీఆర్‌ను కలిసిన అనంతరం తుమ్మల ప్రకటన విడుదల చేశారు. బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌లో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నందున ప్రాసెసింగ్ యూనిట్లతో కూడిన ఫుడ్ పార్క్ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని వివరించినట్లు చెప్పారు. దీంతో మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం టోర్నీ



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ

ఖమ్మం స్పోర్ట్స్: సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం మహిళలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ పోటీలకు 150మంది క్రీడాకారిణిలు హాజరుకాగా, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో బాలికలు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కాగా, క్రీడాకారిణిలకు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.నర్సింహారెడ్డి తన సతీమణి జ్ఞాపకార్థం టీ షర్టులు అందజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, డీఈఓ సోమశేఖరశర్మ, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌తోపాటు కోచ్‌లు గోపీకృష్ణ, రఘునందన్, టి.సుధీర్, అక్బర్ అలీ, కీర్తి సైదులు, కైలాష్, సురేష్, పరిపూర్ణాచారి, సాంబమూర్తి, పవన్, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ పోటీల్లో జి.చరిష్మ(ఖమ్మం రూరల్) మొదటి స్థానంలో నిలవగా ఆతర్వాత స్థానాల్లో డి.దివ్య(మధిర), పి.సేతు శ్రీవల్లి, కె.కీర్తన(ఖమ్మం) నిలిచారని డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి తెలిపారు.

నారాయణ బస్సులను సీజ్ చేసిన ఎంవీఐ

సాక్షి ఎఫెక్ట్..



సీజ్ చేసిన నారాయణ స్కూల్ బస్సులు

మధిర: రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ స్కూల్ బస్సులను వైరా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ గురువారం సీజ్ చేశారు. 'నారాయణ... నారాయణ' శీర్షికన ఈనెల 14న 'సాక్షి'లో నారాయణ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న వైనంపై కథనం ప్రచురితమైంది. రవాణా శాఖ ద్వారా ఓ చోట అనుమతి తీసుకుని మరోచోట బస్సులు నడుపుతున్నట్లు ఈ కథనంలో ప్రస్తావించగా, స్పందించిన ఎంవీఐ విచారణ చేపట్టారు. ఈమేరకు మేడ్చల్ ఆర్టీఏ నుంచి పర్మిట్ తీసుకుని, అరవై కి.మీ. దాటి బస్సులు నడుపుతుండడంతో రెండింటిని సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. కాగా, బస్సులను సీజ్ చేయడంతో సాయంత్రం ఇంటికి వెళ్లాల్సిన విద్యార్థులపై పట్టింపు లేనట్లు వ్యవహరించిన యాజమాన్యం, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో పలువురు అప్పటికప్పుడు ద్విచక్ర వాహనాలపై వచ్చి పిల్లలను తీసుకెళ్లారు.

బెదిరించి రూ.21.57 లక్షల నగదు దోపిడీ

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి మీదుగా కారులో వెళ్తున్న వ్యక్తులను బెదిరించిన దుండగులు భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు దోచుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరికి చెందిన బి.శ్రీనివాసరెడ్డి హనుమకొండలోని ఓ ప్రైవేట్ చిట్ కంపెనీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు బుధవారం రాత్రి సమయంలో శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు వర్షిత్‌తో పాటు ముదిరెడ్డి సురేందర్‌రెడ్డి, నిమ్మల అన్వేష్, తోట కరుణాకర్ కారులో రూ.21,57,700 నగదుతో ఖమ్మం నుండి హైదరాబాద్ బయలుదేరారు. వీరి కారు మద్దులపల్లి శివార్లలోకి రాగానే ద్విచక్రవాహనంపై వచ్చి అడ్డగించిన ఇద్దరు వ్యక్తులు గట్టిగా అరవడంతో ఏం జరిగిందోనని కారు ఆపారు. ఈక్రమంలో ప్రమాదం జరిగినట్లు వారు గొడవ చేస్తుండగా కారులో మరో ఆరుగురు అక్కడకు చేరుకున్నారు. ఈక్రమంలో కారులోని శ్రీనివాసరెడ్డి తదితరులపై దాడి చేసి వారి వద్ద ఉన్న రూ.21లక్షలకు పైగా నగదు, నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితులు గురువారం సాయంత్రం ఖమ్మం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

కేసీఆర్‌కు ఎంపీ నామ జన్మదిన శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామ నాగేశ్వరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నవీన భారతాన్ని నిర్మించేందుకు ముందుకు సాగుతున్న కేసీఆర్‌కు యావత్ తెలంగాణ సమాజం వెన్నుదన్నుగా నిలుస్తోందని గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయని ఎంపీ తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకల నిర్వహణకు దేవాదాయ శాఖ నిధులు విడుదల చేశారు. ఉత్సవాల నిర్వహణకు నిధులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లుగా అర్చకుడు కొడవటిగంటి నరసింహారావు వెల్లడించిన వివరాలతో గురువారం 'సాక్షి'లో శివయ్యా....నా వల్ల కాదయ్యా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఈఓ పి.నారాయణచార్యులు ఆలయాన్ని సందర్శించి అర్చకుడితో మాట్లాడారు. ఈమేరకు శివరాత్రి వేడుకలకు రూ.20 వేలు ఇవ్వడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పగా అర్చకుడు నరసింహారావు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

త్రివేణి సంగమం..

- కోరిన కోర్కెలు తీర్చే సంగమేశ్వరస్వామి
- తీర్థాల సంగమేశ్వరుడికి వందల ఏళ్ల నాటి చరిత్ర
- నేటి నుంచి మొదలుకానున్న జాతర



మహాశివరాత్రి పూజలకు ముస్తాబైన సంగమేశ్వరాలయం, (ఇన్‌సెట్) సంగమేశ్వరస్వామి

ఖమ్మంరూరల్: కోరిన కోర్కెలు తీరుస్తాడనే పేరున్న ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలోని సంగమేశ్వరస్వామి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఏటా మహారాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే జాతరకు లక్షలాదిగా భక్తులు హాజరవుతారు. ఖమ్మం జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా ఈ జాతరకు భక్తులు తరలిరానున్నారు. ఆలయం పక్కనే మున్నేరు, ఆకేరు, బుగ్గవాగు కలిసే త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తుల నమ్మిక.

ఇదీ ఆలయ చరిత్ర

చారిత్రక ఆధారాల ప్రకారం.. త్రేతాయుగంలో భక్తులకు కలలో కనిపించిన శివుడు తనను ఇక్కడ(ప్రస్తుత తీర్థాల గ్రామం) శివలింగాకారంలో ప్రతిష్ఠించాలని చెప్పడంతో శివలింగాకారాన్ని ఏర్పాటు చేసి ఆలయం నిర్మించాక సంగమేశ్వరుడి ఆలయంగా నామకరణం చేసినట్లు చెబుతారు. అనంతరం ఆలయం కీకారణ్యంలో కలిసిపోయింది. ఆతర్వాత ఆయుర్వేద వైద్యుడు బజ్జురు నాగయ్య ఔషధ మూలికల కోసం నది ఒడ్డున మట్టిదిబ్బను తవ్వుతుండగా ఆలయ ఆనవాళ్లు బయటపడడంతో గ్రామస్తులు చేరుకుని తవ్వారట. ఈ సమయంలో గోపురం లేకుండా గది మాదిరి నిర్మాణం బయటపడింది. అక్కడ ఆలయానికి తూర్పువైపున కుమారస్వామి, పడమరన కాలభైరవుడు, ఉత్తరాన వినాయకుడు, దక్షిణాన ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించడంతో పాటు ఆరడుగల ఎత్తు రాతి స్తంభంపై దీపారాధన చేయాలని తాళపత్ర గ్రంథాలు బయటపడడంతో పూజలు ఆరంభించారు. ఇక ఈ ప్రాంతంలో మున్నేరు, ఆకేరు, బుగ్గవాగు కలుస్తుండడంతో త్రివేణి సంగమంగా పేరొచ్చింది. అనంతర కాలంలో వనం వారి వంశీకులు ఆలయాన్ని ఆధీనంలోకి తీసుకొని తీర్థాల గ్రామంగా నామకరణం చేయగా... ఆవరణలో శ్రీనరసింహస్వామి ఆలయం కూడా నిర్మించారు. ఈ ఆలయంలో ఏటా మహాశివరాత్రి సందర్భంగా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా జరిగే తీర్థాల జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖమ్మం రూరల్, ట్రాఫిక్ ఏసీపీలు బస్వారెడ్డి, రామోజీ రమేష్ తెలిపారు. ఈమేరకు గురువారం వారు ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశ ముండడంతో నాలుగు మార్గాల్లోని 36 ప్రాంతాలలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రైవేట్ వాహనాల కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేయగా, ఆర్టీసీ బస్సులను మాత్రమే ఆలయానికి 50 అడుగుల దూరం వరకు అనుమతిస్తారని తెలిపారు. ఇతర వాహనాల్లో వచ్చే భక్తులు పార్కింగ్ స్థలాల్లో నిలిపి కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇక పోలీసు సిబ్బందికి తోడు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యాన క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం రూరల్ సీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐలు అంజలి, అశోక్, ఎస్సైలు వెంకటకృష్ణ, రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: మహాశివరాత్రి సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వర ఆలయంలో జరగనున్న జాతరకు ఖమ్మం నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, సీఐ రామయ్య తెలిపారు. ఈనెల 17, 18, 19వ తేదీల్లో కొత్త బస్టాండ్, సిటీ బస్టాండ్, కాల్వొడ్డు నుంచి కామంచికల్ మీదుగా సంగమేశ్వర గుడి వరకు 50 ప్రత్యేక బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు. పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20గా చార్జీ నిర్ణయించామని తెలిపారు. ఆర్టీసీ బస్సులను మాత్రమే అతి సమీపం వరకు అనుమతించనున్నందున భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆలయం ముందు వేసిన షామియానాలు



సిద్ధమైన క్యూ లైన్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

మంత్రిని కలిసిన కల్లూరు ఏసీపీ

ఖమ్మంమయూరిసెంటర్: కల్లూరు ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.రామానుజం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలో గురువారం కలిసిన ఆయనను మంత్రి అభినందించి శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ

మహాశివరాత్రికి ముస్తాబు

ఖమ్మంగాంధీచౌక్: మహా శివరాత్రి మహోత్సవాలకు జిల్లాలో శివాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనుండగా.. జిల్లాలోని గుంటు మల్లేశ్వర స్వామి, తీర్థాల సంగమేశ్వర స్వామి, పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వర స్వామి తదితర ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించగా భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్లు, తాగునీటి వసతి కల్పించారు. అలాగే, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు సిద్ధం చేసి, పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయనున్నారు.



విద్యుత్ లైట్ల కాంతుల్లో ఖమ్మంలోని గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

మధిర: అనుమానం పెంచుకున్న భర్త చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మధిరలో జరుగుతున్న కేబుల్ లైన్ పనుల కోసం మోతే మండలం చంద్రుపట్ల నుంచి కొందరు కూలీలు 15 రోజుల క్రితం రాగా జిలుగుమాడు సమీపాన ఉంటున్నారు. ఈక్రమంలో చంద్రుపట్లకు చెందిన ఓర్సు నాగరాజు, కవిత దంపతులు కూడా చిన్న కుమారుడితో కలిసి వచ్చారు. తన భార్యపై తరచూ గొడవ పడే నాగరాజు ఈనెల 9న కవితపై ఫైబర్ పైపుతో దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కవిత తండ్రి వీరయ్య ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఘటనపై వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి తెలిపారు.

దాడిలో గాయపడిన యువకుడు..

ఖమ్మంక్రైం: చిన్న విషయంలో మొదలైన ఘర్షణతో స్నేహితుడు పెట్రోల్ పోసి నిప్పంటించగా తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెట్రోల్ విషయమై ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన ధనుష్‌కుమార్, ఆయన స్నేహితుడు ఫయాజ్ మధ్య ఈనెల 12న గొడవ జరగగా క్షణికావేశానికి గురైన రియాజ్ ధనుష్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధనుష్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఫయాజ్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం వన్ టౌన్ పోలీసులు వెల్లడించారు.

రైతు మృతి కేసులో ఒకరి అరెస్టు

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లికి చెందిన రైతు ఇలవల వెంకటరెడ్డిపై ఇటీవల ఇరవై మంది ఇనపరాడ్లు, కర్రలతో దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు దాడి కేసులో నిందితుడైన కంజుల వీరారెడ్డిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

వివాహితను వేధిస్తున్న వారిపై కేసు

నేలకొండపల్లి: వివాహితను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తతో పాటు అత్తమామలపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలోని అనాసాగారానికి చెందిన జ్యోతితో ముజ్జుగూడెంకు చెందిన సంతోష్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం ఏర్పడగా 2020లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తామామలు వేధిస్తుండడమే కాక సంతోష్ ఇంకో వివాహం చేసుకునేందుకు యత్నిస్తున్నాడని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా మామ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, భర్త తన వ్యక్తిగత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరిస్తున్నట్లు పేర్కొనగా ముగ్గురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రూ.10వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులకు చెందిన కుమ్మరికుంట్ల నాగయ్య ఖాతా నుండి సైబర్ నేరగాళ్లు రూ.10వేలు కొట్టేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14న నాగయ్యకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఏటీఎం కార్డు గడువు తీరినందున, కొత్త కార్డు ఇచ్చేందుకు ఓటీపీ పంపిస్తున్నట్లు చెప్పాడు. ఆ మాటలు నమ్మిన నాగయ్య ఓటీపీ చెప్పగానే ఖాతా నుండి రూ.10వేలు డ్రా అయినట్లుగా సమాచారం వచ్చింది. దీంతో ఆయన గురువారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పాలడుగులో వరిగడ్డి దగ్ధం

వైరారూరల్: ట్రాక్టర్‌పై వరిగడ్డి తీసుకెళ్తున్న క్రమంలో విద్యుత్ వైర్లు తాకగా గడ్డి దగ్ధమైంది. మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన రైతు కోరే వెంకటేశ్వర్లు గురువారం ట్రాక్టర్‌పై వరిగడ్డి వేసుకుని వెళ్తుండగా పాలడుగులోని పాఠశాల వద్ద విద్యుత్ వైర్లు తాకాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంట అంటుకోవడంతో గడ్డి పూర్తిగా కాలిపోయింది. కాగా, అదే మార్గంలో వెళ్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా ఇచ్చిన సమాచారంతో ఎంపీఓ జ్యోత్స్నాదేవి, కార్యదర్శి కుమార్ మంటలు అదుపు చేయించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని పిండిప్రోలుకు చెందిన ఒబలగాని వేణు(26)న్యూమోనియాతో పాటు కడుపునొప్పి ఉండడంతో ఈనెల 8న పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా గురువారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు హైదరాబాద్‌కు అఖిల్ మృతదేహం

మధిర: గన్ మిస్‌ఫైర్ కావడంతో ఈ నెల 6న అమెరికాలో మృతి చెందిన మధిర విద్యార్థి అఖిల్‌శ్రావిక్(సాయి) మృతదేహం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనుంది. ఈ విషయమై కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఆతర్వాత శనివారం ఉదయంకల్లా మధిరకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

క్లుప్తంగా...



కల్వకుర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం తిని పదిమందికి అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో ఐదుగురు విద్యార్థులు ఆస్పత్రిలో చేరిక

కల్వకుర్తి రూరల్: పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనం తిని 10 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. పాఠశాలలో గురువారం వండిన భోజనం సరిగ్గా ఉడకకపోవడంతో పాటు వాసన వచ్చింది. దీంతో భోజనం తిన్న విద్యార్థుల్లో 10 మంది వాంతులు చేసుకోవడంతో పాటు తలనొప్పితో బాధపడ్డారు. వీరిలో ఐదుగురు రాకేష్, గణేష్, సురేందర్, యశ్వంత్, సూర్యతేజలకు వాంతులు ఎక్కువ కావడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కొన్నిరోజులుగా మహిళలకు బదులుగా వారి భర్తలు మధ్యాహ్న భోజనం వండుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. హెచ్‌ఎం కస్నానాయక్ ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

తల్వార్‌తో కేక్ కట్‌చేసిన మంత్రి



నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బర్త్‌డే వేడుకలకు ఓ నేత తల్వార్‌తో వచ్చారు. మంత్రికి తల్వార్‌ను ఇచ్చి కేక్ కట్ చేయాలని చెప్పారు. దీంతో ఇంద్రకరణ్‌రెడ్డి తల్వార్‌తో కేక్ కట్‌చేసి నేతలకు తినిపించారు. ఈ వేడుకలకు నిజామాబాద్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, నిజామాబాద్ మున్సిపల్ మేయర్, వారి అనుచరులు వచ్చారు. తల్వార్ పోలీసుల అనుమతితోనే క్యాంపు కార్యాలయంలోకి వచ్చిందా లేక పోలీసుల కళ్లుగప్పి తెచ్చారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



వేములవాడ: మహా శివరాత్రి సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. నేటి నుంచి ఆలయంలో శివరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి.

పురుగు మందు మితిమీరుతోంది!

▶ మొదటి పేజీ తరువాయి



అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదని ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు ఓ సమావేశంలో అభిప్రాయపడ్డారు. సహజ సిద్ధమైన విధానాలు అవలంబిస్తే భూసారాన్ని పరిరక్షించవచ్చని, సాగు ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి పెరుగుతుందనేది అపోహ..

వ్యవసాయంలో రసాయన మందుల వినియోగం పెంచడం వల్ల దిగుబడి పెరుగుతుందనేది ఒక అపోహ మాత్రమే. ఒక్కోసారి సీజన్‌లోని వాతావరణ పరిస్థితులతో దిగుబడి పెరిగినా.. క్రిమిసంహారకాల వినియోగం పెంచడంతో క్రమంగా దిగుబడి తగ్గుతుంది. ఇటీవలి కాలంలో రైతులు తరచుగా జ్వరం, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలకు గురవుతున్నారు. పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా గాలిద్వారా రసాయనాలు కొంతమేరకు శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. శరీరంపై పడిన రసాయనాల వల్ల చర్మ సంబంధిత వ్యాధులు బాధిస్తాయి. పలు అంతర్జాతీయ సంస్థలు ఈ అంశాలపై పరిశోధనలు జరిపి ధ్రువీకరించాయి. మరోవైపు రసాయనాలతో కూడిన మందుల వినియోగంతో భూసారం తగ్గితే, ఎరువుల వాడకాన్ని కూడా పెంచాల్సి వస్తుంది. ఇది రైతుకు అదనపు భారంగా మారుతుంది. అందువల్ల సహజసిద్ధమైన పద్ధతుల్లో సాగు చేయడమే మేలు. దిగుబడి ఒకేసారి పెరగనప్పటికీ, భవిష్యత్తులో లాభదాయకంగా ఉంటుంది.
– నర్సింహారెడ్డి, వ్యవసాయ రంగ నిపుణులు

క్రిమిసంహారకాలు అత్యధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలు (మె. టన్నుల్లో)

రాష్ట్రం	2017-18	2018-19	2019-20	2020-21
మహారాష్ట్ర	15,568	11,746	12,783	13,243
ఉత్తర్‌ప్రదేశ్	10,824	11,049	12,217	11,557
పంజాబ్	5,835	5,543	4,995	5,193
తెలంగాణ	4,866	4,894	4,915	4,986
హరియాణా	4,025	4,015	4,200	4,050
జాతీయ స్థాయి	63,406	59,670	61,702	62,193

ఒక్క డాక్యుమెంట్ రూ.15.96 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చే మిస్కిపేటలో 1,54,880 చదరపు గజాల భూమిని ఓ ఆయిల్ కార్పొరేషన్, ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కలిసి మరో రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించాయి. ఈ భూమి మార్కెట్ విలువ రూ.466 కోట్లుగా నిర్ధారించిన రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు 35.51 కోట్ల ఫీజు వసూలు చేశారు. గండిపేట, రాజేంద్రనగర్, వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ పలు భారీ లావాదేవీలు, 5 డాక్యుమెంట్ల ద్వారా రూ.100 కోట్ల రెవెన్యూ వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.14,500 కోట్లదాకా ఆదాయం!

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పరిశీలిస్తే.. ఫిబ్రవరి 13 నాటికి రూ.12,310 కోట్ల వరకు ఖజానాకు చేరినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మరో నెలన్నర రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో.. ఇంకో రూ.2,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్ల వరకు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో పేర్కొన్న విధంగా రూ.16 వేల కోట్లు, 2023–24కు నిర్దేశించుకున్న రూ.18 వేల కోట్లు సమకూరే అవకాశం లేదని.. రిజిస్ట్రేషన్ ఫీజులు లేదా భూముల విలువలను సవరిస్తేనే లక్ష్యం చేరుకోవడం సాధ్యమని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లన్నీ కలిపి రూ.14,500 కోట్ల మేరకు సమకూరవచ్చని అంటున్నారు.

2022-23లో భారీగా ఫీజు వచ్చిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు (రూ.కోట్లలో)

నెల	రిజిస్ట్రార్ ఆఫీసు	రెవెన్యూ
మే (2022)	కూకట్‌పల్లి	35.51
ఏప్రిల్ (2022)	గండిపేట	21.72
ఆగస్టు (2022)	గండిపేట	16.21
జనవరి (2023)	గండిపేట	15.96
అక్టోబర్ (2022)	రాజేంద్రనగర్	15.08
ఏప్రిల్ (2022)	వనస్థలిపురం	14.43
సెప్టెంబర్(2022)	కూకట్‌పల్లి	13.58

వైద్యసేవల్లో తెలంగాణ ఫస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

ఇస్తే సంతోషపడాల్సిందిపోయి బాధపడుతున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు అవకాశం లేక, ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తే ఒకరు కుట్ర అంటున్నారని, అంబేడ్కర్ పేరు మీద సచివాలయం నిర్మిస్తే ఇంకొకరు కూలుస్తం అంటున్నారని మండిపడ్డారు. పేల్చేటోని చేతికో.. కూల్చేటోని చేతికోపోతే తెలంగాణ ఆగం అవుతుందన్నారు. వచ్చే నెల మొదటి వారంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో న్యూట్రిషన్ కేసీఆర్ కిట్లను ప్రారంభించనున్నామని, ఏప్రిల్ మొదటి వారంలో 33 జిల్లాల్లో ప్రారంభించనున్నామని తెలిపారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుండటంతో మహారాష్ట్ర, కర్ణాటక సర్పంచులు.. తమను తెలంగాణలో కలపాలని వినతులు ఇస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా వార్త వచ్చిందని బీబీసీ మీద ఐటీ దాడులు చేయించడాన్ని చూసి ప్రజలు నవ్వుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

నలుగురు మహిళలు దుర్మరణం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతులు.. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో పనిచేసే కార్మికులు
- ప్రమాదానికి కారణమైన బస్సు కూడా కంపెనీదే..



ఆటోను ఢీకొట్టిన బస్సు



అనసూయ(ఫైల్)



నాగలక్ష్మి(ఫైల్)



శిరీష (ఫైల్)



ధనలక్ష్మి(ఫైల్)

చౌటుప్పల్: ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి నాలుగు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. సరైన సమయంలో బ్రేకులు పడకపోవడంతో జరిగిన ప్రమాదంలో నిరుపేద కుటుంబాలకు చెందిన నలుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో గురువారం చోటుచేసుకుంది. ఇండస్ట్రియల్ పార్కులో శ్వేత తెలుగు ఫుడ్స్ (పచ్చళ్ల కంపెనీ)లో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పనిచేస్తున్నారు. దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రోజూ మాదిరిగానే ఉదయం 8.30కి ఆటోలో కంపెనీకి బయలుదేరారు. ఇదే కంపెనీలో పనిచేసేందుకు రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కార్మికులు కంపెనీకి చెందిన అద్దె బస్సుల్లో వస్తారు. ఆ క్రమంలో కార్మికులతో వస్తున్న బస్సు ఇండస్ట్రియల్ పార్కు తూర్పు వైపున ఉన్న రోడ్డులో వస్తోంది. బస్సు వస్తున్న రోడ్డు ఏటవాలుగా ఉండడంతో డ్రైవర్ బస్సు గేరును న్యూట్రల్ చేశాడు. సరిగ్గా అదే సమయంలో మహిళా కార్మికులతో వస్తున్న ఆటో కంపెనీలోకి వెళ్లేందుకు కుడివైపునకు తిరుగుతుండగా బస్సు బలంగా వచ్చి ఢీకొట్టింది. బస్సును ఆపేందుకు దాని డ్రైవర్ ప్రయత్నించినప్పటికీ గేరు న్యూట్రల్‌లో ఉన్న కారణంగా ఆగకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డాకోజి నాగలక్ష్మి(28), వరకాంతం అనసూయ(55), సిలివేరు ధనలక్ష్మి(35), దేవరపల్లి శిరీష(30) మృతిచెందారు. ఆటోడ్రైవర్ కొండ వెంకటేష్ తో పాటు మరో ముగ్గురు మహిళలు చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. నలుగురు మృతి చెందడంతో దేవలమ్మనాగారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామస్తులు పచ్చళ్ల కంపెనీ ముందు ఆందోళనకు దిగారు. శిరీష మృతదేహాన్ని కంపెనీ ముందు ఉంచి ఆందోళన చేశారు.

అదృశ్యమై... ఆపై శవాలై

- ప్రేమికుల దినోత్సవం ముందు రోజే వెళ్లారు..
- మరణంలో సైతం ఒక్కటేనన్నట్టు చేతులు కట్టుకొని చెరువులో దూకారు



కల్పన (ఫైల్)



ఖదీర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మూడు రోజులుగా కనిపించకుండా పోయిన ఆ జంట అదృశ్యం మిస్టరీ విషాదాంతమైంది. వారి మృతదేహాలు గురువారం నార్సింగిని ఆనుకునే ఉన్న క్యాసంపల్లి చెరువులో లభ్యమయ్యాయి. మరణంలోనూ తమను విడదీయలేరనే భావంతో వివాహిత చున్నీతో ఇద్దరూ తమ చేతులను కట్టుకొని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తోట సిద్ధరాములు చిన్న కూతురు తోట కల్పన (18) పదో తరగతి వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఖలీల్ (19) కల్పన పెద్దనాన్న వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న క్రమంలో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ క్రమంలో పలుమార్లు గొడవలు జరగగా ఖలీల్‌ను పనిలోంచి తీసేశారు. మూడు నెలల క్రితం కల్పన వివాహం కామారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన వ్యక్తితో జరిగింది. పెళ్లయినా ఖలీల్‌తో సాన్నిహిత్యం కొనసాగేది. కల్పన గత సోమవారం పుట్టింటికి వచ్చింది. కల్పన అదేరోజు రాత్రి బస్సులో రామాయంపేటకు రాగా, ఖలీల్ బైక్‌పై వచ్చాడు. ఇద్దరూ కలిసి నార్సింగికి చేరుకున్నారు. చెరువువద్ద బైక్‌తోపాటు చెప్పులు విడిచి కల్పన చున్నీతో ఇద్దరి చేతులు కట్టుకొని నీటిలో దూకినట్టు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం ఇద్దరి మృతదేహాలు నీటిలో తేలగా, చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరి మృతదేహాలను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాబ్‌మేళాలతో గిరిజనులకు జీవనోపాధి



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యాన నిర్వహించే జాబ్‌మేళాలతో గిరిజన యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీడీఏ భవిత విభాగం జేడీఎం హరికృష్ణ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో వివిధ ప్రైవేట్ కంపెనీల్లో నియామకాల కోసం గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 150 మంది హాజరుకాగా ఇంటర్వ్యూల అనంతరం 84 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జేడీఎం హరికృష్ణ మాట్లాడుతూ గిరిజన యువతకు విద్యావకాశాలతో పాటు జీవనోపాధి కల్పించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 84మందికి ఒకేరోజు ఉద్యోగావకాశాలు లభించగా, త్వరలోనే నియామక ఉత్తర్వులు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఉద్యోగులు స్వరూప, సమ్మయ్య, పాపారావు, కంపెనీల ప్రతినిధులు పవన్, గోపి, మనోజ్, అనిల్, సుబ్రహ్మణ్యం, శ్రీరాం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపికలు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపికలు చేపట్టనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. కిన్నెరసాని(బాలురు), కాచినేనపల్లి (బాలికలు)తో పాటు హైదరాబాద్ బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లా విద్యార్థినీ, విద్యార్థులకు కిన్నెరసానిలో, ఖమ్మం జిల్లా విద్యార్థులకు ఉసిరికాయలపల్లి గిరిజన ఆశ్రమ హైస్కూల్‌లో ఈనెల 25నుంచి 28 తేదీ వరకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 31 ఆగస్టు 2023 నాటికి 9 నుండి 11 ఏళ్ల వయస్సు కలిగిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మార్చిలో తుది ఎంపికలు నిర్వహించి ఐదో తరగతిలో ప్రవేశం కల్పిస్తామని పీఓ వివరించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు వివరాల కోసం ఐటీడీఏలోని డీడీ, స్పోర్ట్స్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా వార్తలు

గోళ్లపాడు అందాలు అదరహో!



పార్కులో లాన్, కూర్చునేందుకు బెంచీలు



ఓపెన్ జిమ్



వైకుంఠపాళి పటం

ఖమ్మం జిల్లా కేంద్రంలోని గోళ్లపాడు చానల్‌పై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన రూపొందించిన పార్కులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చదనంతోపాటు పార్కుల్లో స్థానికులు సరదాగా గడిపేందుకు, ఆడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే, ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటుచేయగా ఉదయం, సాయంత్రం పిల్లలతో పాటు వ్యాయామం చేసేందుకు వస్తున్న వారితో సందడి నెలకొంటోంది. ఇక సేదతీరేందుకు బెంచీలు, ఆడుకునేందుకు స్కేటింగ్ రింక్, చదరంగం, వైకుంఠపాళి వంటి ఏర్పాట్లు కూడా ఉండడం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది.
– ఖమ్మం మయూరిసెంటర్

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మానుకోట జిల్లా జడ్జి పాటిల్ వసంత్



పరీక్ష చేయించుకుంటున్న జడ్జి పాటిల్ వసంత్

మహబూబాబాద్ రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులు, జర్నలిస్టులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి వసంత్ కంటి పరీక్షలు చేయించుకున్నాక మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, అధికారులు, న్యాయవాదులు అంబరీష్, వెంకటయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాచరిక పాలన'



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

పెద్దవంగర: రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోందని బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమయ్య ఆరోపించారు. పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ప్రజాగోస– బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సాయిని రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాంచందర్‌రావు, సోమయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు రంగు రాములు, బొమ్మెర బోయిన సుధాకర్, ఝాన్సీ, తలారి సోమయ్య, గడపురం భిక్షపతి, జలగం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'తెర' మరుగు!



థియేటర్ వద్ద స్థానికులు

మధిర: ఖమ్మం జిల్లా మధిరలోని వాసవీ థియేటర్ ఇక జ్ఞాపకంగా మిగిలిపోనుంది. 1981 జనవరిలో వాసవి థియేటర్‌ను ప్రారంభించగా, కృష్ణంరాజు నటించిన బెబ్బులి సినిమా మొదటగా ప్రదర్శించారు. ఇలా 42 ఏళ్ల పాటు ప్రేక్షకులను అలరించిన ఈ థియేటర్ స్థలాన్ని రిలయన్స్ సంస్థ లీజ్‌కు తీసుకుంది. భవనాన్ని నేలమట్టం చేసి నూతనంగా మాల్ నిర్మించనుండగా.. గురువారం అమిగోస్ చిత్రప్రదర్శనతో థియేటర్‌ను మూసేశారు. కాగా, లడక బజారుకు చెందిన చెరుపల్లి శ్రీధర్, రావిరాల శశికుమార్ తదితరులు 1981లో మొదటి సినిమాను, గురువారం చివరి సినిమా చూడడంతో పాటు ఫొటోలు దిగి జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ధూప, దీప నివేదన పథకంలోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నివేదన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్ శర్మ, మరిగంటి భార్గవాచార్యులు తెలిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు ఆయుష్షు హోమాలు, నవగ్రహ జప హోమాలు, మహా మృత్యుంజయ పాశుపత రుద్రహోమాలు నిర్వహించాలని రాష్ట్ర ధూప దీప నివేదన అర్చక సంఘం రాష్ట్ర కమిటీ తీర్మానించిందని పేర్కొన్నారు. ఈమేరకు అర్చకులు పూజలు చేయాలని కోరారు.

104 వాహనాల ఈ - వేలం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లాలోని 104 వాహనాలను ఈ– వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. 2008 మోడల్ స్వరాజ్ మజ్దా కంపెనీకి చెందిన 11 వాహనాలు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22న సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో వేలం ఉంటుందని తెలిపారు. ఒక్కో వాహనం ప్రారంభ ధర రూ.3.50లక్షలుగా నిర్ణయించామని, అదనంగా 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాల కోసంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీఈడీలో వంద శాతం ఉత్తీర్ణత

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని బీఈడీ కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కాకతీయ యూనివర్సిటీ అధికారులు బీఈడీ ద్వితీయ సంవత్సరం ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈమేరకు కళాశాల నుంచి పరీక్షలు రాసిన 90 మంది ఉత్తీర్ణులయ్యారని అధికారులు వెల్లడించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లలిత కుమారి, ఉద్యోగులను ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, డీడీ రమాదేవి అభినందించారు.

కేవీని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రీయ విద్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా గురువారం సందర్శించారు. ఈసందర్భంగా తరగతి గదులు, వసతిగృహాలు, బోధనా తీరును ఆమె పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే, ఉపాధ్యాయులతో సమావేశమై ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇస్లాంఖాన్, ఎంఈఓ శాంసన్, ఏఎంఓ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కొనసాగిన 'న్యాక్' పరిశీలన



అధ్యాపకులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) త్రిసభ్య బృందం పరిశీలన రెండో రోజైన గురువారం కూడా కొనసాగాయి. ఈసందర్భంగా జేకేసీ, ల్యాంగ్వేజ్ ల్యాబ్, వర్చువల్ క్లాస్‌రూం, డిజిటల్ క్లాస్‌రూం, లైబ్రరీ, వ్యాయామశాల, క్రీడా మైదానం, బొటానికల్ గార్డెన్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం రికార్డులు, తరగతి గదిలో అధ్యాపకుల బోధనా తీరును పరిశీలించి పలువురు అధ్యాపకుల పరిశోధనా వివరాలు తెలుసుకున్నారు. ఆతర్వాత తనిఖీ బృందం కన్వీనర్ ఎం.కృష్ణన్ మాట్లాడుతూ కళాశాలలో సదుపాయాలు బాగున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ నిర్మాణానికి పునాదాలు వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, రైతు బంధు రాష్ట్ర సలహాదారుడు పులిగళ్ల మాధవరావు, పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరై శ్రీనివాస్, అర్వపల్లి రాధాకృష్ణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో తోపుడు బండి ఫౌండేషన్ బాధ్యుడు సాదిక్

కల్లూరు రూరల్: సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు కల్లూరు క్రీడాకారులు ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జరగనున్న ఈ పోటీలకు సురుగు గోపి, కొసనం కార్తీక్ ఎంపికయ్యారని త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా క్రీడాకారులతోపాటు పీఈటీలు లక్ష్మీనర్సయ్య, వీరరాఘవయ్య, జయరావు, విజయకుమారి, సత్యనారాయణరెడ్డిని హెచ్‌ఎం మాధవరావు, తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు సాదిక్ తదితరులు గురువారం అభినందించారు.